క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

లింగంపేట: విద్యార్థుల ప్రగతికి నివేదికలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల నోడల్ అధికారి సాయన్న సూచించారు. మంగళవారం మండలంలోని నల్లమడుగు కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజర్ కాకుండా చూడాలన్నారు.

చట్టం ద్వారా సమాచారం పొందవచ్చు

ఎల్లారెడ్డి రూరల్: సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి సమాచారాన్ని పొందవచ్చని సమాచార హక్కు చట్టం ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు ఇంతియాజ్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం హక్కు చట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మధు, ప్రిన్సిపాల్ సాయిబాబా, శశిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

పిట్లం: మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రేషన్ షాపును తహసీల్దార్ రాంమోహన్‌రావ్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యా ర్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు దేవీసింగ్, రేషన్ డీలర్ దేవయ్య ఉన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపిక



తాడ్వాయి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం అగ్నిపథ్ నియామకాల్లో ఎంపికైన దేమికలాన్ గ్రామానికి చెందిన రాపోల్ నడిపిబాలయ్య, ఎల్లవ్వ కుమారుడైన రాపోల్ శ్రీకాంత్‌ను అభినందించారు. రోజూ గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారని గ్రంథపాలకుడు రాజలింగం తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడుతో పాటు గ్రామపెద్దలు కరుణాకర్, రాములు, రవి, రాజిరెడ్డి, గంగారెడ్డి, నారాయణరెడ్డి, శంకర్, బాలురాజు అభినందించారు.

కంప్యూటర్ల వితరణ

బాన్సువాడ రూరల్: మండలంలోని పోచారం తండాకు చెందిన రాములునాయక్ తాను చదువుకున్న ఇబ్రాహింపేట్‌లోని జెడ్పీహైస్కూల్‌కు రెండు కంప్యూటర్లు అందజేశారు. మంగళవారం సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకాగౌడ్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్‌లకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవారం నారాయణరెడ్డి, వసీయొద్దీన్, రాజ్ కుమార్,సాయిలు యాదవ్ పాల్గొన్నారు.

సుద్దముక్కపై చిత్రం



బాన్సువాడ రూరల్: మండలంలోని పోచారం తండాకు చెందిన సరిచంద్, జీవన్‌నాయక్‌లు మైక్రోఆర్ట్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. జాతీయ చిహ్నాలు, జాతీయ నాయకులు చిత్రాలను సబ్బు, చాక్‌పీస్, పెన్సిల్ లెడ్‌పై చెక్కుతూ పలువురిని ఆకట్టుకుంటున్నారు. బుధవారం గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకుని సరిచంద్ సుద్దముక్కపై, జీవన్‌నాయక్ పెన్సిల్ లెడ్‌పై చిత్రాలను చెక్కారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



నాగిరెడ్డిపేట: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తాండూర్ త్రిలింగేశ్వరాలయంలో నిర్వహించనున్న ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సురేందర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు.

పోటీ పరీక్షల కోసం పుస్తకాల అందజేత

దోమకొండ: దాతల సహాయంతో కొనుగోలు చేసిన పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పున్న రాజేశ్వర్ మంగళవారం స్థానిక గ్రంథాలయానికి అందజేశారు. పుస్తకాల కొనుగోలుకు సహాయ సహకారం అందించిన అభ్యుదయ పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ ఎండపల్లి నవీన్ కుమార్, ఆర్‌ఎంపీ డాక్టర్ రాజును ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనుగంటి శారద , జెడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, లైబ్రరియన్ కపిల్, నాయకులు గంగ్రి మధుసూదన్ రావు, కుంచాల శేఖర్, పోచయ్య, పాలకుర్తి శేఖర్, పున్న లక్ష్మన్, చిన్నగారి నర్సింలు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల మోసాలను ఎండగడతాం

- కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రూ.500 గ్యాస్ సిలిండర్
- మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల మయం చేశారు
- హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు

కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగడుతామని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో మాజీ మంత్రి షబ్బీర్ అలీతో కలిసి ఆమె హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రావాల్సిన రూ. 4,200 కోట్లు చెల్లించకుండా సీఎం కేసీఆర్ మహిళలను మోసం చేశాడన్నారు. మిగుల బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాని అప్పుల కుప్పగా మార్చేసినా సమస్యలు మాత్రం తీరలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే గ్యాస్ సిలిండర్ రూ.500లకే సరఫరా చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు నిర్మిస్తామని, రూ.2 లక్షల వరకు ఒకే సారి రైతు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు కేసీఆర్, కేటీఆర్‌లకు భజన చేస్తూ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లే దన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత, నాయకు లు పండ్ల రాజు, శివ కృష్ణమూర్తి, కారంగుల అశోక్ రెడ్డి, ఐరెని సందీప్, గుడుగుల శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

మద్నూర్: లింగాయత్‌లను బీసీలో చేర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని మండలంలోని సోమూర్‌లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం పేర్కొన్నారు. మండలంలోని పెద్ద ఎక్లార, పెద్ద తడ్గూర్, చిన్న తడ్గూర్, సోమూర్, దన్నూర్, ఖరగ్ గ్రామాలలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. నాయకులు విఠల్‌రెడ్డి, వట్నాల్ రమేశ్, భగవాన్, గంగాధర్, సౌదాగర్ అరవింద్, నాగ్‌నాథ్‌పటేల్, హన్మంత్‌యాదవ్, అబ్బు, వీరభద్ర, విఠల్‌రావ్, మారుతి, చంద్రకాంత్, అనిల్ పాల్గొన్నారు.

సదాశివనగర్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌ను గెలిపించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రావు కోరారు. మంగళవారం మండలంలోని పద్మాజివాడి గ్రామంలో ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లింగాగౌడ్, బాబ్‌జాని, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పద్మాజివాడిలో మదన్ మోహన్ రావు..

నాగిరెడ్డిపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సామాన్యులకు న్యాయం జరుగుతుందని ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. గాంధారి మండలం నర్సాపూర్, ముద్దేల్లి, హెమ్లానాయక్ తండా, వెంకటపూర్, గౌరారం గ్రామాలలో ఇంటింట వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించారు.

కేంద్ర పథకాలు ఎందుకు అమలు చేయరు?

- పేదలకు అన్యాయం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- ప్రజాగోస బీజేపీ భరోసాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణారెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ఫసల్ బీమా యోజన పథకాలను రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మాచారెడ్డి, రాజఖాన్‌పేట, అక్కాపూర్, లచ్చాపేట, గన్‌పూర్(ఎం), చుక్కాపూర్, గజ్యానాయక్ తండా, మంథని దేవునిపల్లి, పాల్వంచ, ఎల్పుగొండ, వాడి, ఫరీదుపేట, బండరామేశ్వర్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో అన్ని గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయించారని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం, 14, 15 వ ఫైనాన్స్ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కరువు కాటకాలతో పంటలు నష్టపోయిన రైతులను ఫసల్ బీమా ఎంతో ఆదుకుంటుందని, రాష్ట్రంలో ఆ పథకాన్ని ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికలలో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకటరెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట బాలరాజు, నాయకులు చారి, బూస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: బూత్ స్థాయిలో బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట, వెంకటాపూర్ గ్రామాలలో బూత్ కమిటీల సమావేశాలను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు మురళి, బీజేపీ నాయకులు దేవేందర్, మల్లేషం తదితరులు ఉన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలని ఆందోళన



బాన్సువాడలో ధర్నా చేస్తున్న ఆపరేటర్లు



ఎల్లారెడ్డిలో..

బాన్సువాడ టౌన్: విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు పీఆర్‌సీ అమలు చేయాలని విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 డివిజన్ అధ్యక్షుడు జిన్న దత్తు, కార్యదర్శి హన్మండ్లు డిమాండ్ చేశారు. స్థానిక ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ముందు మంగళవారం ఆపరేటర్లు ప్లకార్డులు పట్టుకుని ధర్నా నిర్వహించారు. బేసిక్ పే ను రూరల్ పర్సనల్ పేతో కలిపిన తర్వాతనే ఆర్టిజన్లకు 50 శాతం పీఆర్‌సీ, ఫిట్మెంట్ ఇవ్వాలని, ఆర్టిజన్లకు ఈపీఎఫ్ సీలింగ్ లిమిట్‌ను తీసేయాలని కోరారు.

ఎల్లారెడ్డిరూరల్: పీఆర్‌సీ అమలు చేయాలని కోరుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ముందు లంచ్ అవర్‌లో ధర్నా నిర్వహించారు. ఈపీఎఫ్ సీలింగ్ లిమిట్ తొలగించాలని, ప్రతి సబ్ స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు హరికృష్ణ, కిష్టాగౌడ్ తదితరులు ఉన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోండి

బాన్సువాడ టౌన్: తపాల శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖకు చెందిన నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ కోరారు. మంగళవారం బాన్సువాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన తపాల శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సేవింగ్, సుకన్య ఖాతాలు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్, టర్మ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఐదేళ్లలోపు పిల్లలకు ఉచిత ఆధార్ నమోదు, రూ.10 లక్షల ప్రమాద బీమా సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గత ఏడాది చిన్న పిల్లలకు అత్యధికంగా ఆధార్ నమోదు చేయించిన తపాలా సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ బోధన్ ఇన్‌స్పెక్టర్ వేణు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు పవన్‌రెడ్డి, లక్ష్మణ్, బాన్సువాడ పోస్ట్‌మాస్టర్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్

ముగిసిన కబడ్డీ పోటీలు



సదాశివనగర్: జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడైన కోతి రాజిరెడ్డి స్మారకార్థం మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రామారెడ్డి మండలం స్కూల్ తండా జట్టుకు రూ.10 వేల నగదు, ద్వితీయ స్థానాన్ని సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామం కైవసం చేసుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు కోతి లింగారెడ్డి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి



హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తున్న కార్మికులు

బాన్సువాడ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి బాన్సువాడ నుంచి ఆర్టీసీ కార్మికులు తరలివెళ్లారు. బీఎంఎస్ డిపో అధ్యక్షుడు అంబాజీ మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి 2021 వేతన సవరణలు వెంటనే అమలు చేయాలని, గుర్తింపు సంఘాల కోసం ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్మికులు మారుతి, గంగాధర్, హన్మండ్లు, రాజు హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో ఉన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: ఇంటర్మీడియట్, పదో తరగతిలో మోడల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల అసోసియేషన్ ముద్రించిన డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి నాగరాజు, ప్రిన్సిపాల్ సాయిబాబా, శశిశంకర్, అంజిలప్ప, లక్ష్మీనర్సయ్య, భాగ్యలక్ష్మి, స్రవంతి, శక్తిరాజ్, శివాజీ తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో తాత్కాలిక షెడ్ కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తాత్కాలికంగా షెడ్ నిర్మాణానికి మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ బాన్సువాడ ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో రూ. 3 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. పనులు పూర్తయ్యే వరకు ప్రయాణీకులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా షెడ్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదల కల సాకారం చేసేందుకు కృషి

కామారెడ్డి రూరల్: పేదల కల సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తున్నారని ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో 36 మంది లబ్ధిదారులకు లాటరీ తీసి ఇళ్లను కేటాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునేందుకు పేదలకు భారంగా మారుతున్న పరిస్థితుల్లో ఒక్క రూపాయి తీసుకోకుండా ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్‌రావు, సర్పంచ్ రత్నాబాయి ఆనందరావు, ఎంపీటీసీలు కమ్మరి అనంతలక్ష్మి శ్రీనివాస్, భీమయ్యల నీలవ్వ, కో ఆప్షన్ మెంబర్ ఫజీల్, రాజు, నాయకులు గట్టగోని గోపిగౌడ్, రామా గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల కేటాయింపునకు లాటరీ తీస్తున్న ఎంపీపీ

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



సదాశివనగర్: మండలంలోని మల్లుపేట్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను, డిక్షనరీ, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర రక్తదాతల సమన్వయ కర్త బాలు, ప్రతినిధులు గంగాప్రసాద్, చంద్రశేఖర్, ఉప్పల శ్రీనివాస్, ప్రధానోపాధ్యారాలు విజయ, ఉపాధ్యాయురాలు రజిని తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

■ ఆలయ నిర్మాణ కమిటీ కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని అడ్లూరులో పోచమ్మ ఆలయ నిర్మాణానికి సంబంధించి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెరుమాండ్ల రాజు, కోశాధికారిగా పెరుమాండ్ల శంకర్, కుంబాల బాలరాజు, సభ్యులుగా కుంభాల రాజు, కుంభాల నరసింహులు, బత్తుల శంకర్, కుంబాల స్వామి, జగ్గ లక్ష్మణ్, పెరుమాండ్ల చిన్న లింగం, బంటు అనిల్, జెగ్గ ఈశ్వర్, దెబ్బటి నర్సింగ్, బంటు శంకర్, పెరుమాండ్ల రాజనర్సింలు, పెరుమాండ్ల రాములు, కుంబాల ఎల్లయ్య, కుంబాల గంగరాజు, కుంబాల కుమార్ ఎన్నికయ్యారు.

■ కాంగ్రెస్ యువజన అధ్యక్షుడి నియామకం

రాజంపేట: మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడిగా కొండాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ సల్మాన్‌ను నియమించారు.

సామాజిక సేవలోనే సంతృప్తి

మాచారెడ్డి: సామాజిక సేవలోనే సంతృప్తి లభిస్తుందని ఎంపీపీ ఎల్.నర్సింగరావ్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లెలో తన సొంత డబ్బు రూ. 3 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రం, హైమాస్ లైట్లను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆయన వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మిన్కూరి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌చంద్రం, విండో చైర్మన్ పూల్‌చంద్‌నాయక్, గ్రామ సర్పంచ్ లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ క్యాన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ఆధ్యాత్మికం

■ తుల్జాభవాని ఆలయంలో హోమం



లింగంపేట: మండలంలోని మాలోత్‌సంగ్యా నాయక్ తండాలో మంగళవారం తుల్జాభవాని ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో గిరిజనులు హోమం నిర్వహించారు. అంతకుముందు అఖండ దీపారాధన, అభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కునాయక్, ఎంపీటీసీ సామ్లి, విఠల్, రమేశ్, మోహన్, లక్ష్మన్‌నాయక్ పాల్గొన్నారు.

శివాలయంలో..

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో మంగళవారం హోమం నిర్వహించారు. అనంతరం అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, పాత రాజులు, తన్నీరు శేఖర్, చిన్నోళ్ల గోపాల్‌రావు, సాయాగౌడ్, గూడెల్లి వెంకటరమణ, కాసర్ల రాజేశం పాల్గొన్నారు.

■ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

పిట్లం: మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం తండాకు చెందిన గోపాల్ నాయక్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

■ మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారం కొచ్చరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. పెద్ద ఎత్తున కుంకుమ అర్చనలు చేశారు.

■ శివ పార్వతుల కల్యాణం



తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి నాగలింగేశ్వర ఆలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో హోమం నిర్వహించారు. తర్వాత శివ, పార్వతుల కల్యాణం నిర్వహించారు.

నులి పురుగుల నిర్మూలనపై అవగాహన

బీబీపేట: మండలంలోని జనగామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై కమ్యూనిటీ ఆరోగ్య అధికారి రాజు అధ్వర్యంలో విద్యార్థులకు అవగాహక కల్పించారు. మల మూత్ర విసర్జన చేసిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఆడుకొని చేతులు కడుక్కోకుండా భోజనం చేస్తే కడుపులో నులి పురుగులు చేరుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాత రాజు, ఆరోగ్య సిబ్బంది సుఖన్య, ఆశ వర్కర్ ప్రవీణ, సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విజయస్ఫూర్తి కార్యక్రమం

పిట్లం: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు లక్ష్యాన్ని చేరుకునేందుకు వీలుగా ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పిట్లంలో విజయస్ఫూర్తి నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ వెల్లడించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు డాక్టర్ యోమియా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిణి సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్‌లో చేపట్టిన ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేయాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు.

అరెస్టు చేయడం సరికాదు

కామారెడ్డి టౌన్: సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న సిబ్బందిని ముందస్తు అరెస్టు చేయడం సమంజసం కాదని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్ పేర్కొన్నారు.

తెలుగు టీచర్లను నియమించండి

మద్నూర్: హండేకేలూర్‌లోని యూపీఎస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ నీలావతి ఎంఈవో కార్యాలయ సిబ్బందిని కోరారు.

అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువు పెంపు

ఎల్లారెడ్డి: మోడల్ స్కూల్‌లో 6వ తరగతి అడ్మిషన్ల కోసం 22వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సాయిబాబా తెలిపారు.

మద్నూర్: మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత కోరారు. వచ్చే నెల 6వ తేదీ లోగా రూ. 100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

రామారెడ్డి: ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక విద్యావనరుల కేంద్రంలో మంగళవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. టాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతు లు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీధర్, గురుచరణం, శ్రీకాంత్, లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, ప్రసాద్, గీత పాల్గొన్నారు.

మినీ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం

నిజాంసాగర్: మండలంలోని కొమలంచలో మినీ వాటర్ ట్యాంకు నిర్మాణానికి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ భూమిపూజ నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్, వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 3 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

సిమెంట్ రోడ్డు పనులు..

కామారెడ్డి రూరల్: మండలంలోని క్యాసంపల్లిలో సిమెంట్ రోడ్డు పనులను ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు ప్రారంభించారు. సర్పంచ్ మంజుల, ఎంపీవో మలహరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎల్లారెడ్డి: సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు డీపీవో శ్రీనివాసరావును కలిసి విజ్ఞప్తి చేశారు.